




Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక







ఆదివారం 12-04-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 300 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్


## ఏకాంతంగా ఉన్న జంటలే టార్గెట్.. వీడియోలతో ఏఎస్ఐ అరాచకాలు..!




న్యూస్ డెస్క్, 11 ఏప్రిల్ (ఇది కద నిజం): ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే కీచకులుగా మారితే ఇక సామాన్యులకు దిక్కెవరు?. అచ్చం ఇలాంటి ఘటనే ఏపీలో కలకలం రేపుతోంది. ఏకాంతంగా ఉన్న ప్రేమికుల జంటలను ఫోన్?లో వీడియోలు తీసి వాటిని చూపించి బెదిరించడంతో పాటు తన కోరికలు తీర్చాలని వేధిస్తున్న ఓ ఏఎస్సై నిర్వాకం బట్టబయలైంది. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో పోలీసులే సాగిస్తున్న ఈ తతంగం ఇప్పుడు ఎస్పీ వరకు చేరడంతో దీనిపై పోలీస్ శాఖ విచారణకు ఆదేశించింది.

**డబ్బుతో ఆగని దాహం.. కోరిక తీర్చాలంటూ..**

మాచర్ల నియోజకవర్గంలోని పర్యాటక ప్రాంతాలకు, ప్రశాంతంగా ఉండే ప్రదేశాలకు కళాశాల విద్యార్థులు, ప్రేమికులు వస్తుంటారు. దీనినే ఆ ఏఎస్సై తన సంపాదన మార్గంగా మార్చుకున్నాడు. ఇక్కడికి వచ్చిన యువతీ యువకులు ఎవరైనా ఏకాంతంగా ఉన్నట్లు గమనిస్తే వారిని సదరు ఏఎస్సై వీడియోలు తీయించి, స్టేషన్‌కు పదండంటూ బెదిరింపులకు పాల్పడి నగదు వసూలు చేస్తున్నాడు.

2 లో

## మీడియా రంగంలోకి విజయసాయి రెడ్డి

### త్వరలో మూడు భాషల్లో న్యూస్ ప్లాట్‌ఫామ్



న్యూస్ డెస్క్, 11 ఏప్రిల్ (ఇది కద నిజం): ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉన్న మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి కీలక ప్రకటన చేశారు. త్వరలోనే ఆయన మీడియా రంగంలోకి అడుగుపెడుతున్నట్లు తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్విట్టర్ వేదికగా ప్రకటించి తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తించారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ఓ డిజిటల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించబోతున్నట్లుగా ఆయన వెల్లడించారు. అయితే, ఈ ప్లాట్‌ఫామ్ వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశాన్ని వివరిస్తూ విజయసాయి రెడ్డి తన ట్వీట్‌లో పలు కీలక అంశాలను ప్రస్తావించారు.తెలుగుతో పాటు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా హిందీ, ఇంగ్లీష్ భాషల్లోనూ వార్తా కథనాలను అందించనున్నట్లుగా తెలిపారు.

2 లో

## కాళేశ్వరానికి సీఎం రేవంత్ 'రిపేర్'

### వానాకాలానికి ముందే పనులు పూర్తి

- బ్యారేజీలకు తక్షణ మరమ్మతులు
- నిధులపై సీఎం హామీ
- 8 లక్షల ఎకరాలపై ప్రభావం
- ఎన్‌డిఎస్‌ఏ సూచనలు అమలు
- సాంకేతిక పరీక్షలు కీలకం
- ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం
- నిర్మాణ సంస్థలపై ఒత్తిడి
- కాంట్రాక్టర్లలో అనిశ్చితి
- ఇంజినీరింగ్ సవాళ్లు తీవ్రం
- పంప్ హౌస్ సమస్యలు పరిష్కారం



మిగతాది 2 లో..

న్యూస్ డెస్క్, 11 ఏప్రిల్ (ఇది కద నిజం): గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని వేల కోట్ల రూపాయలు అప్పు చేసి మరీ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది. తద్వారా లక్షల ఎకరాలకు సాగు నీరందించడమే లక్ష్యంగా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత–చేవెళ్ల నిర్మాణానికి సిద్ధం అయితే.. అక్కడ నీటి లభ్యత లేదనే సాకుతో లొకేషన్‌ను కాళేశ్వరానికి మార్చారు. అయితే.. వేల కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన ప్రాజెక్టులోని బ్యారేజీ పిల్లర్లు గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కుంగుబాటుకు గురైన సంగతి తెలిసిందే. అప్పటినుంచి ప్రాజెక్టు నిరుపయోగంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రాజెక్టు అవకతవకలపై కమిషన్ వేసి విచారణ చేయించింది. ఈ క్రమంలో తాజాగా ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి ఫోకస్ పెట్టారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యారేజీలకు మరమ్మతు చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే అన్ని మరమ్మతులు పూర్తి చేసి, అవసరమైన సాంకేతిక పరీక్షలు నిర్వహించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

**మరమ్మతులు వేగవంతం..**

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీఎం తాజాగా సమీక్ష చేయడంతో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతు పనులు వేగవంతంగా కానున్నాయి. ప్రాజెక్టు ద్వారా ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో లక్షల ఎకరాల సాగు నీరు అందనుంది. అయితే.. ప్రాజెక్టు పడావు పడినప్పటి నుంచి సుమారు 8 లక్షల ఎకరాల వరకు సాగు పరిస్థితి ప్రశ్నార్థకమైంది. తాజాగా.. సీఎం ఆదేశాలతో నీటి సరఫరా పునరుద్ధరించే విషయం రైతాంగానికి కొంత ఊరటనిస్తోంది. అదేస్థాయిలో ఈసారి నిజంగా గడువులో పూర్తవుతాయా? అనే ప్రశ్న రైతుల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు.. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ సూచించిన విధంగా పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ప్రత్యేక కార్యాచరణను రూపొందించి నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ ఆధ్వర్యంలో పరీక్షలు, నమూనాల సేకరణను వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తిచేసేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. అటు నీటిపారుదల శాఖ, సీడబ్ల్యూపీఆర్ఎస్, బ్యారేజీల నిర్మాణ సంస్థలు, డిజైన్ కన్సల్టేషన్స్‌తో టీమ్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు.

**నిర్మాణ సంస్థల ఉద్దేశమేంటి..?..**

కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణలో నిర్మాణ సంస్థల స్పందన అత్యంత కీలకంగా మారింది. భారీ స్థాయిలో సాంకేతిక మరమ్మతులు, నిర్మాణపరమైన బలపరిచే పనులు అవసరమవుతున్న నేపథ్యంలో చేపట్టేందుకు సంస్థలు ముందుకు వస్తాయా? అన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మిగిలింది.గతంలో ఎదురైన సాంకేతిక సమస్యలు, ఒత్తిడి, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన అనిశ్చితి కలిసి కాంట్రాక్టర్లలో అభద్రతా భావం నెలకొంది. ముఖ్యంగా మేడిగడ్డ వంటి కీలక నిర్మాణాల్లో లోపాలు బయటపడిన తర్వాత, మరమ్మతులు సాధారణ పనులు కాకుండా అత్యంత క్లిష్టమైన ఇంజినీరింగ్ సవాళ్లుగా మారాయి.

## తెలంగాణకు వడగాల్పుల హెచ్చరిక

### నేటి నుంచి 10 రోజుల పాటు భానుడి భగభగలు




2 లో

న్యూస్ డెస్క్, 11 ఏప్రిల్ (ఇది కద నిజం): ఇప్పటికే పెరిగిన ఎండలతో సతమతమవుతున్న ప్రజలకు వాతావరణ శాఖ పిడుగులాంటి వార్త చెప్పింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎండల తీవ్రత మరింత పెరగడంతో పాటు ఏప్రిల్ 12 నుంచి ఏప్రిల్ 22 వరకు రాష్ట్రమంతటా తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.ఈ కాలంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

## జగిత్యాలలో ఈ నెల 20న కేసీఆర్ బహిరంగసభ

- బీఆర్ఎస్‌లో చేరనున్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి
- మోతె రోడ్‌లో సభ స్థలాల పరిశీలన పూర్తి
- లక్ష మందితో సభ విజయవంతం లక్ష్యం



న్యూస్ డెస్క్, 11 ఏప్రిల్ (ఇది కద నిజం): తెలంగాణ రాజకీయాలు మళ్లీ హాట్ టాపిక్ గా మారాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నుంచి సీనియర్ నాయకులు మాజీ మంత్రి జీవన్ రెడ్డి పార్టీ వీడడంతో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. జీవన్ రెడ్డి ఇప్పటికే బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ ను కలిసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జగిత్యాలలో ఈ నెల 20 న సాయంత్రం 05 గంటలకు కెసిఆర్ బహిరంగసభ నిర్వహించనున్నారు. కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకొనున్నారు మాజీ మంత్రి జీవన్ రెడ్డి.

జిల్లా కేంద్రంలోని మోతె రోడ్ లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సమాచారం. బహిరంగ సభ స్థలాలను మాజీమంత్రి జీవన్ రెడ్డి, ఉమ్మడి జిల్లా బిఆర్ఎస్ నేతలు పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ఎస్.కె.ఎన్.ఆర్ డిగ్రీ కాలేజ్, మోతే రోడ్డు, కాలేజీ గ్రౌండ్ స్థలాలను పరిశీలించారు. జగిత్యాల లో కేసీఆర్ సభ స్థలాలను పరిశీలించిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ రమణ, లోక్ బాపు రెడ్డి లు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ లు.

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు విద్యాసాగర్ రావు మాట్లాడుతూ.. ఈ నెల 20 న జగిత్యాల మోతె రోడ్ లో కేసీఆర్ బహిరంగా సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కేసీఆర్ కోసం రావడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సుమరు ఒక లక్ష మంది తో సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. నా శేష జీవితంలో కేసీఆర్ తో కలిసి పనిచేయడం నా అదృష్టంగా భావిస్తున్నా.. మార్పు రావాలంటే కేసీఆర్ రావాలి రేవంత్ రెడ్డి పోవాలి.. రెండున్నర సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని తెలిపారు.

## మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు ఊహించని షాక్.. 6 నెలల జైలు శిక్ష



2 లో

## ఇరాన్ కండీషన్లకు ఒప్పుకున్న అమెరికా



2 లో

న్యూస్ డెస్క్, 11 ఏప్రిల్ (ఇది కద నిజం): పశ్చిమాసియా లో నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించే దిశగా కీలక అంతర్జాతీయ పరిణామం చోటుచేసుకుంది.ఇరాన్ పెట్టిన కఠిన నిబంధనలకు అమెరికా సానుకూలంగా స్పందించడంతో దౌత్యపరమైన చర్చలకు మార్గం సుగమమైంది.

# ఇరాన్ కండీషన్లకు ఒప్పుకున్న అమెరికా

న్యూస్ డెస్క్, 11 ఏప్రిల్ (ఇది కద నిజం): పశ్చిమాసియా లో నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించే దిశగా కీలక అంతర్జాతీయ పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ పెట్టిన కఠిన నిబంధనలకు అమెరికా సానుకూలంగా స్పందించడంతో దౌత్యపరమైన చర్చలకు మార్గం సుగమమైంది. ఇరు దేశాల మధ్య అధికారిక చర్చలు ప్రారంభం కావడానికి ముందే ఇరాన్ పెట్టిన రెండు ప్రధాన డిమాండ్లకు అమెరికా అంగీకారం తెలిపినట్లు అంతర్జాతీయ దౌత్య వర్గాలు వెల్లడించాయి. లెబనాన్ సరిహద్దుల్లో తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించి, ఉద్రిక్తతలను తగ్గించడం, అంతర్జాతీయ బ్యాంకుల్లో అమెరికా ఆంక్షల కారణంగా ఫ్రీజ్ అయిన ఇరాన్ ఆస్తులను వెంటనే విడుదల చేయాలని అమెరికా ఎదుట ప్రతిపాదనలు పెట్టారు. అయితే, ఈ రెండు కండీషన్లకు అమెరికా అంగీకరించడం పశ్చిమాసియాలో రాజకీయాల్లో ఒక భారీ మలుపుగా విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా, ఇరాన్ ఆస్తుల విడుదల ద్వారా ఆ దేశానికి ఆర్థికంగా పెద్ద ఊరట లభించనుంది. అదే సమయంలో లెబనాన్‌లో సీజ్‌ఫైర్ కుదరడం ఇజ్రాయెల్-హిజ్బుల్లా మధ్య యుద్ధ మేఘాలు తొలగిపోవడానికి దోహదపడనుంది. ఓ వైపు అమెరికాతో దౌత్యం నడుపుతూనే, ఇరాన్ తన పొరుగు దేశమైన పాకిస్థాన్ తో వ్యూహాత్మక చర్చలు జరుపుతోంది. శుక్రవారం అర్ధరాత్రి ఇరాన్ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌తో సమావేశమైంది. ప్రాంతీయ భద్రత, సరిహద్దుల్లో ఉగ్రవాద నియంత్రణపై సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. అమెరికాతో జరగబోయే చర్చల నేపథ్యంలో పాక్ మధ్యవర్తిత్వం, మద్దతు కోరే అవకాశం ఉందని తెలుస్తోంది.

# తెలంగాణకు వడగాల్పుల హెచ్చరిక

## నేటి నుంచి 10 రోజుల పాటు భానుడి భగభగలు

మొదటి పేజీ తరువాయి

ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలో ఎండల ప్రభావం అత్యధికంగా ఉంటుందని, కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 44°C మార్కును కూడా దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

హైదరాబాద్‌లోనూ సెగలు

వాతావరణ శాఖ అంచనా ప్రకారం.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కూడా ఎండలు దంచికొట్టనున్నాయి. ఏప్రిల్ 12 నుంచి వరుసగా 10 రోజుల పాటు నగరంలో 40°C నుండి 41°C వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ఉక్కపోతతో పాటు వడగాల్పులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేయనున్నాయి. ఈ పది రోజుల వ్యవధిలో వర్షాలు కురిసే అవకాశం చాలా తక్కువగా ఉందని, అక్కడక్కడా చెదురుముదురు జల్లులు తప్ప పెద్దగా ఉపశమనం ఉండదని వాతావరణ నివేదిక స్పష్టం చేస్తోంది. తీవ్రమవుతున్న ఎండల దృష్ట్యా మధ్యాహ్నం వేళల్లో అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తగా ఉండాలని, డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండటానికి తగినంత నీరు, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

# మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు ఉహించని షాక్.. 6 నెలల జైలు శిక్ష



న్యూస్ డెస్క్, 11 ఏప్రిల్ (ఇది కద నిజం): మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు ఉహించని షాక్ తగిలింది. 10 సంవత్సరాల క్రితం కేసులో విశాఖ అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఆయనకు జైలు శిక్ష విధిస్తూ శనివారం కీలక తీర్పు వెలువరించింది. సుమారు పదేళ్ల క్రితం నమోదైన ఒక కేసులో ఆయనకు 6 నెలల జైలు శిక్షతో పాటు రూ. 5,000 జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ వరలక్ష్మి తీర్పునిచ్చారు. ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో ఒక్కసారిగా కలకలం రేపింది.

అసలు కేసు ఏమిటంటే?

2016 ఏప్రిల్ 17న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక రైల్వే జోన్ సాధించాలనే డిమాండ్‌తో గుడివాడ అమర్నాథ్ విశాఖలోని జీవీఎంసీ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహం దగ్గర నిరసన దీక్ష చేపట్టారు. అయితే, ఆ సమయంలో ఆయన చేసిన దీక్షను ఆత్మహత్యాయత్నంగా పరిగణిస్తూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై సుదీర్ఘ కాలంగా విచారణ సాగగా, తుది వాదనలు విన్న న్యాయస్థానం నేడు తీర్పును వెల్లడించింది. అయితే, ఈ తీర్పుపై గుడివాడ అమర్నాథ్ స్పందిస్తూ.. తాను ప్రజా సమస్యల కోసం పోరాటం చేశానని, న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ చేయనున్నట్లు తెలిపారు.

# ఏకాంతంగా ఉన్న జంటలే టార్గెట్.. వీడియోలతో ఏఎస్ఐ అరాచకాలు..!



న్యూస్ డెస్క్, 11 ఏప్రిల్ (ఇది కద నిజం): ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే కీచకులుగా మారితే ఇక సామాన్యులకు దిక్కెవరు?. అచ్చం ఇలాంటి ఘటనే ఏపీలో కలకలం రేపుతోంది. ఏకాంతంగా ఉన్న ప్రేమికుల జంటలను ఫోన్‌లో వీడియోలు తీసి వాటిని చూపించి బెదిరించడంతో పాటు తన కోరికలు తీర్చాలని వేధిస్తున్న ఓ ఏఎస్సై నిర్వాకం బట్టబయలైంది. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో పోలీసులే సాగిస్తున్న ఈ తతంగం ఇప్పుడు ఎస్పీ వరకు చేరడంతో దీనిపై పోలీస్ శాఖ విచారణకు ఆదేశించింది.

డబ్బుతో ఆగని దాహం.. కోరిక తీర్చాలంటూ..

మాచర్ల నియోజకవర్గంలోని పర్యాటక ప్రాంతాలకు, ప్రశాంతంగా ఉండే ప్రదేశాలకు కళాశాల విద్యార్థులు, ప్రేమికులు వస్తుంటారు. దీనినే ఆ ఏఎస్సై తన సంపాదన మార్గంగా మార్చుకున్నాడు. ఇక్కడికి వచ్చిన యువతీ యువకులు ఎవరైనా ఏకాంతంగా ఉన్నట్లు గమనిస్తే వారిని సదరు ఏఎస్సై వీడియోలు తీయించి, స్టేషన్?కు పదండంటూ బెదిరింపులకు పాల్పడి నగదు వసూలు చేస్తున్నాడు. అంతటితో ఆగకుండా తన కోరిక తీర్చాలంటూ యువతులను బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఇలా జంటల వీడియోలను రికార్డు చేసేందుకు ఏకంగా జమ్మలమడుకకు చెందిన ఓ ఆటో డ్రైవర్‌ను తన ఏజెంట్‌గా నియమించుకుని ఈ దందా సాగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఆ వ్యాపారి వీడియోతో గుట్టు రట్టు: ఇటీవల మాచర్లలో ఓ వ్యాపారి ఓ మహిళతో సన్నిహితంగా ఉన్న వీడియో తీసి వారిని బెదిరించి పలు దఫాలుగా లక్షల రూపాయలు వసూలు చేశారు. ఇదే స్టేషన్ లో పని?చేస్తున్న ఎస్సై, కానిస్టేబుల్ సైతం ఇదే దందా సాగిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. మాచర్ల వ్యాపారి ఘటనతో ఇక్కడి పోలీసులు సాగిస్తున్న ఈ గలీజ్ దందా బయటపడినట్లు టాక్ వినిపిస్తోంది. పోలీసుల వసూళ్ల పర్వానికి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ విషయం కాస్త జిల్లా ఎస్పీ దృష్టికి చేరింది. దీనిపై జిల్లా ఎస్పీ బి.కృష్ణారావును మాట్లాడుతూ.. వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న విషయమై తమకు సమాచారం అందిందన్నారు. దీనిపై విచారించి తగిన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కాగా ప్రస్తుతం ఈ ఘటన మాచర్ల పరిసర ప్రాంతాల్లో సంచలనంగా మారింది. ఆత్మాభిమానం దెబ్బతింటుందనే భయంతో బయటకు చెప్పలేక ఎంతో మంది బాధితులు కుమిలిపోతున్నారని, సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# కాళేశ్వరానికి సీఎం రేవంత్ 'రిపేర్'..వానాకాలానికి ముందే పనులు పూర్తి



న్యూస్ డెస్క్, 11 ఏప్రిల్ (ఇది కద నిజం): గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని వేల కోట్ల రూపాయలు అప్పు చేసి మరీ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది. తద్వారా లక్షల ఎకరాలకు సాగు నీరందించడమే లక్ష్యంగా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల నిర్మాణానికి సిద్ధం అయితే.. అక్కడ నీటి లభ్యత లేదనే సాకుతో లొకేషన్‌ను కాళేశ్వరానికి మార్చారు. అయితే.. వేల కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన ప్రాజెక్టులోని బ్యారేజీ పిల్లర్లు గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కుంగుబాటుకు గురైన సంగతి తెలిసిందే. అప్పటినుంచి ప్రాజెక్టు నిరుపయోగంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రాజెక్టు అవకతవకలపై కమిషన్ వేసి విచారణ చేయించింది. ఈ క్రమంలో తాజాగా ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి ఫోకస్ పెట్టారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యారేజీలకు మరమ్మతు చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే అన్ని మరమ్మతులు పూర్తి చేసి, అవసరమైన సాంకేతిక పరీక్షలు నిర్వహించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

మరమ్మతులు వేగవంతం..

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీఎం తాజాగా సమీక్ష చేయడంతో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతు పనులు వేగవంతంగా కానున్నాయి. ప్రాజెక్టు ద్వారా ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో లక్షల ఎకరాల సాగు నీరు అందనుంది. అయితే.. ప్రాజెక్టు పడావు పడినప్పటి నుంచి సుమారు 8 లక్షల ఎకరాల వరకు సాగు పరిస్థితి ప్రశ్నార్థకమైంది. తాజాగా.. సీఎం ఆదేశాలతో నీటి సరఫరా పునరుద్ధరించే విషయం రైతాంగానికి కొంత ఊరటనిస్తోంది. అదేస్థాయిలో ఈసారి నిజంగా గడువులో పూర్తవుతాయా? అనే ప్రశ్న రైతుల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు.. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ సూచించిన విధంగా పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ప్రత్యేక కార్యాచరణను రూపొందించి నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ ఆధ్వర్యంలో పరీక్షలు, నమూనాల సేకరణను వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తిచేసేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. అటు నీటిపారుదల శాఖ, సీడబ్ల్యూపీఆర్ఎస్, బ్యారేజీల నిర్మాణ సంస్థలు, డిజైన్ కన్సల్టేషన్స్‌తో టీమ్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు.


నిర్మాణ సంస్థల ఉద్దేశమేంటి..?..

కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణలో నిర్మాణ సంస్థల స్పందన అత్యంత కీలకంగా మారింది. భారీ స్థాయిలో సాంకేతిక మరమ్మతులు, నిర్మాణపరమైన బలపరిచే పనులు అవసరమవుతున్న నేపథ్యంలో చేపట్టేందుకు సంస్థలు ముందుకు వస్తాయా? అన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మిగిలింది. గతంలో ఎదురైన సాంకేతిక సమస్యలు, ఒత్తిడి, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన అనిశ్చితి కలిసి కాంట్రాక్టర్లలో అభద్రతా భావం నెలకొంది. ముఖ్యంగా మేడిగడ్డ వంటి కీలక నిర్మాణాల్లో లోపాలు బయటపడిన తర్వాత, మరమ్మతులు సాధారణ పనులు కాకుండా అత్యంత క్లిష్టమైన ఇంజినీరింగ్ సవాళ్లుగా మారాయి. అంతేకాకుండా.. వాటిని నిర్మించిన సంస్థలే వాటికి రిపేర్లు చేయాలని మొదటి నుంచీ ప్రభుత్వం చెబుతూ వస్తున్నది. అయితే.. ఈ ఆదేశాలకు మాత్రం నిర్మాణ సంస్థలు పెద్దగా ముందుకు రావడం లేదు. ఈ క్రమంలో మరోసారి వాటి వైఖరి మీదనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. కాగా నీటి సరఫరా పునరుద్ధరించకపోతే అధిక విస్తీర్ణంలో సాగు వ్యవస్థ సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తున్నది.

వానాకాలంలోపే సవాల్..

కాళేశ్వరం ప్రాజెక్ట్ పునరుద్ధరణలో సమయమే ప్రస్తుతం అతిపెద్ద సవాల్‌గా మారింది. వరదల సీజన్ వేగంగా దగ్గరపడుతున్న నేపథ్యంలో పరిమిత గడువులోనే విస్తృత స్థాయి మరమ్మతులు పూర్తి చేయాల్సిన పరిస్థితి అధికారుల ముందుంది. ఒకవైపు దెబ్బతిన్న బ్యారేజీలు, పంప్ హౌస్‌లో సాంకేతిక సమస్యలు, మరోవైపు క్లిష్టమైన ఇంజినీరింగ్ పనులు.. ఈ రెండింటినీ సమాంతరంగా పూర్తి చేయడం పెద్ద పరీక్షగా మారింది. మేడిగడ్డలో కుంగిపోయిన పిల్లరే కాకుండా మొత్తం 1.6 కిలోమీటర్ల బ్యారేజ్‌ని అధ్యయనం చేయాల్సి ఉంటుందని ఇంజినీర్లు చెబుతున్నారు. మేడిగడ్డ దగ్గర 500 బోరు బావులు తవ్వాల్సి ఉంది. ఇందుకోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాల్సి ఉంది. పనుల ప్రణాళిక, టెండర్లు, నిర్మాణ సంస్థల ఎంపిక, యంత్రాంగం సమీకరణ వంటి ప్రతి దశలో ఆలస్యం జరిగే అవకాశాలు ఉండటంతో గడువు మరింత కఠినంగా మారింది. అయితే.. నిధుల విషయంలోనూ ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని సీఎం భరోసా ఇవ్వడంతో పనులు సైతం చకచకా జరిగే అవకాశాలే కనిపిస్తున్నాయి.

# మీడియా రంగంలోకి విజయసాయి రెడ్డి త్వరలో మూడు భాషల్లో న్యూస్ ప్లాట్‌ఫామ్



న్యూస్ డెస్క్, 11 ఏప్రిల్ (ఇది కద నిజం): ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉన్న మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి కీలక ప్రకటన చేశారు. త్వరలోనే ఆయన మీడియా రంగంలోకి అడుగుపెడుతున్నట్లు తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్విట్టర్ వేదికగా ప్రకటించి తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తించారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ఓ డిజిటల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించబోతున్నట్లుగా ఆయన వెల్లడించారు. అయితే, ఈ ప్లాట్‌ఫామ్ వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశాన్ని వివరిస్తూ విజయసాయి రెడ్డి తన ట్వీట్‌లో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. తెలుగుతో పాటు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా హిందీ, ఇంగ్లీష్ భాషల్లోనూ వార్తా కథనాలను అందించనున్నట్లుగా తెలిపారు. ఈ ప్లాట్‌ఫామ్ ఏ రాజకీయ పార్టీకి కొమ్ముకాయదని, పూర్తి నిష్పాక్షికంగా, కేవలం సత్యం వైపు మాత్రమే నిలబడుతుందని ఆయన స్పష్టం చేశారు. మహిళలు, యువత, రైతులు, కార్మికులు, అణగారిన వర్గాల సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

త్వరలో శాటిలైట్ న్యూస్ ఛానల్..!

డిజిటల్ మీడియా ప్లాట్‌ఫామ్ విజయవంతమైన తర్వాత, అదే విలువలతో ఒక తెలుగు శాటిలైట్ న్యూస్ ఛానల్ ను కూడా ప్రారంభించాలన్నది తమ ప్రణాళిక అని విజయసాయి రెడ్డి ప్రకటించారు. ప్రస్తుతం డిజిటల్ వేదికకు సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయని, దీని పేరును త్వరలోనే వెల్లడిస్తానని ఆయన తెలిపారు. అయితే, విజయసాయి రెడ్డి లాంటి సీనియర్ నేత సొంతంగా ఓ మీడియా సంస్థను ప్రారంభిస్తుండటం ఇప్పుడు రెండు తెలుగు స్టేట్స్ పాలిటిక్స్‌లో చర్చనీయాంశంగా మారింది.

# కస్టడీ నుంచి పారిపోయేందుకు యత్నం.. ప్రేమోన్మాదిపై పోలీసుల కాల్పులు



న్యూస్ డెస్క్, 11 ఏప్రిల్ (ఇది కద నిజం): కడప జిల్లాలోని ఖాజీపేటలో యువతిని గొంతుకోసి అత్యంత దారుణంగా హత్య చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడైన వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు శనివారం తెల్లవారు జామున విచారణ నిమిత్తం మైదుకూరు నుంచి తరలిస్తుండగా బసాపురం చెక్‌పోస్ట్ వద్ద ఇద్దరు కానిస్టేబుళ్లను గాయపరిచి కస్టడీ నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. పోలీసులు వార్నింగ్ ఇచ్చినా నిందితుడు లొంగిపోకపోవడంతో, పోలీసులు అనివార్యంగా మూడు రౌండ్ల పాటు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో నిందితుడు వెంకటేశ్ మోకాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ అతడికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఆసుపత్రి వద్ద పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు.

కాగా, ప్రేమ పేరుతో వేధిస్తూ, కాదన్న కోపంతో ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న ఈ ప్రేమోన్మాది చర్యపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు, మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్న తరుణంలో ఈ కాల్పుల ఘటన చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# మే మొదటి వారంలోనే 10వ తరగతి ఫలితాలు!

న్యూస్ డెస్క్, 11 ఏప్రిల్ (ఇది కద నిజం): 10వ తరగతి విద్యార్థుల నిరీక్షణకు తెరపడనుంది. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న టెన్త్ వార్షిక పరీక్షల తుది ఫలితాలను మే మొదటి వారంలో విడుదల చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తున్నది. ఈనెల 16వ తేదీతో ఎగ్జామ్స్ ముగియనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,676 పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్షలు ముగిసిన వెంటనే పూర్తిస్థాయిలో మూల్యాంకన ప్రక్రియపై దృష్టి సారించాలని అధికారులు నిర్ణయించారు. ఈ ఏడాది ఫలితాలను వీలైనంత త్వరగా వెల్లడించాలనే సంకల్పంతో విద్యాశాఖ ముందస్తు వ్యూహరచన చేసింది. అందులో భాగంగానే ఏప్రిల్ 3వ తేదీ నుంచే సమాధాన పత్రాల మూల్యాంకన ప్రక్రియను ప్రారంభించారు. ప్రధాన భాషలు, గణితం వంటి పేపర్ల మూల్యాంకనం కొనసాగుతున్నది. కాగా, సైన్స్, సోషల్ స్టడీస్ పేపర్లను రెండో విడత వాల్యూయేషన్ చేయనున్నారు. అంటే ఆయా సబ్జెక్టుల పరీక్షలు పూర్తయిన తర్వాత జవాబు పత్రాలను దిద్దనున్నారు. ఈ క్రమంలో ఈనెల 23లోగా మూల్యాంకన ప్రక్రియను పూర్తిచేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇది పూర్తయిన వెంటనే మార్కుల నమోదు ప్రక్రియను చేపట్టనున్నారు.


# టీచర్ రిక్రూట్‌మెంట్ స్కామ్.. మాజీ మంత్రి ఇంట్లో ఈడీ రెయిడ్స్




న్యూస్ డెస్క్, 11 ఏప్రిల్ (ఇది కద నిజం): అసెంబ్లీ ఎన్నికల వేళ పశ్చిమ బెంగాల్ రాజకీయాలను కుదిపేసిన ఉపాధ్యాయ నియామక కుంభకోణం మరోసారి తెరపైకి వచ్చింది. శనివారం ఉదయం మాజీ విద్యాశాఖ మంత్రి, సస్పెండ్ అయిన టీఎంసీ నేత పార్థా ఛటర్జీ నివాసంతో పాటు పలువురి నివాసాలపై ఈడీ అధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. అయితే, టీచర్ రిక్రూట్‌మెంట్ స్కామ్‌కు సంబంధించి మనీ లాండరింగ్ కేసుకు సంబంధించి విచారణకు హాజరుకావాలని ఈడీ అధికారులు పార్థా ఛటర్జీకి మూడుసార్లు నోటీసులు జారీ చేశారు. అయితే, అనారోగ్య కారణాలు చూపుతూ ఆయన విచారణకు హాజరు కాలేదు. దీంతో ఇవాళ ఉదయం కోల్‌కతాలోని ఆయన 'నకతలా' నివాసానికి ఈడీ బృందం చేరుకుంది. భారీగా కేంద్ర బలగాల మోహరింపు మధ్య ఈ సోదాలు కొనసాగుతున్నాయి.

పార్థా ఛటర్జీ నివాసంతో పాటు, ఈ కేసులో మధ్యవర్తిగా ఆరోపణలు ఎదుర్కొంటూ ప్రస్తుతం జైల్లో ఉన్న ప్రసన్న కుమార్ రాయ్ నివాసంలో కూడా ఈడీ సోదాలు చేపట్టింది. ఇక పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు (2026) సమీపిస్తున్న తరుణంలో ఈ దాడులు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 2022లో ఈ కుంభకోణంలో అరెస్ట్ అయిన పార్థా ఛటర్జీ, ఇటీవల సుప్రీంకోర్టు నుంచి షరతులతో కూడిన బెయిల్ పొంది జైలు నుంచి విడుదలయ్యారు. అయితే, ప్రైమరీ టీచర్ల నియామకం, గ్రూప్-సీ, డీ స్టాఫ్ రిక్రూట్‌మెంట్లలో అక్రమాలకు సంబంధించి విచారణ ఇంకా కొనసాగుతోంది. 2022లో ఈడీ సోదాల్లో పార్థా ఛటర్జీ సన్నిహితురాలు అర్పితా ముఖర్జీ నివాసంలో రూ.50 కోట్లకు పైగా నగదు, భారీగా బంగారం లభించడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కుంభకోణం కారణంగా దాదాపు 26 వేల మంది ఉద్యోగాలను సుప్రీంకోర్టు రద్దు చేయడం అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు పెద్ద ఎదురుదెబ్బగా మారింది.

# మహారాష్ట్రలో భూకంపం.. హింగోలిలో 4.7 తీవ్రతతో ప్రకంపణలు




న్యూస్ డెస్క్, 11 ఏప్రిల్ (ఇది కద నిజం): మహారాష్ట్రలోని మరాఠ్వాడా ప్రాంతంలో శనివారం ఉదయం భూకంపం సంభవించి నట్లు తెలుస్తోంది. హింగోలి జిల్లాను కేంద్రంగా చేసుకుని వచ్చిన ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.7గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ వెల్లడించింది. శనివారం ఉదయం సుమారు 8:45 గంటల సమయంలో భూమి కంపించడంతో జనం భయాందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. భూ అంతర్భాగంలో 10 కిలోమీటర్ల లోతులో ఈ ప్రకంపనలు మొదలయ్యాయని అధికారులు తెలిపారు.

హింగోలితో పాటు పొరుగున ఉన్న నాందేడ్, పర్భానీ, వాషిమ్, ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలో కూడా భూకంప ప్రకంపనలు స్పష్టంగా కనిపించాయి. నాందేడ్ నగరంలో కొన్ని సెకన్ల పాటు భూమి కంపించిందని, ఇళ్లలోని సామాన్లు కిందపడ్డాయని స్థానికులు తెలిపారు. అయితే, ఈ భూకంపం వల్ల ఇప్పటివరకు ఎటువంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరిగినట్లు నివేదికలు అందలేదని అధికారులు ధ్రువీకరించారు. గత ఏడాది జూలైలో కూడా ఇదే ప్రాంతంలో 4.5 తీవ్రతతో భూకంపం సంభవించిన సంగతి తెలిసిందే. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పాత భవనాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగం సూచించింది.

# కృష్ణ ఎక్స్‌ప్రెస్ బోగీలో పొగలు..ప్రయాణికులకు తప్పిన పెను ప్రమాదం

న్యూస్ డెస్క్, 11 ఏప్రిల్ (ఇది కద నిజం): ఆదిలాబాద్ నుంచి తిరుపతి వైపు వెళ్తున్న కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైలులో పెను ప్రమాదం తప్పింది. రన్నింగ్‌లో ఓ బోగి కింద నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగలు రావడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ట్రైన్ నెల్లూరు సిటీకి చేరుకుంటున్న తరుణంలో లోకో పైలట్ అప్రమత్తమయ్యారు. రైలులో మంటలు చెలరేగుతున్నాయనే భయంతో ప్రయాణికులు చైన్ లాగి రైలును అక్కడికక్కడే నిలిపివేశారు. భయాందోళనతో ప్రయాణికులు రైలు దిగి పరుగులు తీశారు. లోకో పైలట్ సమాచారం మేరకు రంగంలోకి దిగిన రైల్వే సాంకేతిక సిబ్బంది బోగీని పరిశీలించి బ్రేక్ షూలు జామ్ కావడం వల్ల రాపిడి జరిగి పొగలు వచ్చాయని తేల్చారు. మరమ్మతులు పూర్తయిన తర్వాత ట్రైన్ గమ్య స్థానానికి యథావిధిగా కదిలింది.




# యాదగిరిగుట్ట దేవస్థానంలో అక్రమాల పర్వం: గోదాము సరుకులు సిబ్బంది పాలు


ఇది కద నిజం, యాదగిరిగుట్ట: ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో అక్రమాలు అదుపులేకుండా సాగుతున్నాయి. దేవస్థానానికి వచ్చే ఆదాయం గోల్‌మాల్ అవుతుండగా, అధికారుల పర్యవేక్షణ కరువైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కొండ కింద పుష్కరిణి పక్కన ఉన్న సరుకుల గోదాము అక్రమాలకు అడ్డాగా మారింది. అన్నదాన సత్రం, ప్రసాద విక్రయశాల కోసం నిల్వ ఉంచిన జీడిపప్పు, బాదం వంటి ఖరీదైన సరుకులతో అక్కడి సిబ్బంది సొంతంగా పకోడీలు తయారు చేసుకుంటూ, ప్యాకెట్ల రూపంలో ఇళ్లకు తరలిస్తున్నారు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే.. “కావాలంటే నీకూ పెడతాం, మిగతాది నీకు అనవసరం” అంటూ గడుసుగా సమాధానం చెబుతుండటం గమనార్హం. మరోవైపు, దేవస్థానంలో ఉన్నతాధికారుల పాలన నామమాత్రంగానే ఉందని, స్థానిక ఏఈఓ , డి ఈఓ ల రాజ్యమే నడుస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ అధికారి నెలకు 10 నుండి 15 లక్షల రూపాయల వరకు మామూళ్లు వసూలు చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. గోదాము సూపరింటెండెంట్ తన విధులను గాలికొదిలేశారని, ఈ వ్యవహారాలపై పత్రికల్లో వార్తలు వచ్చినా ఈఓ స్థాయిలో ఎలాంటి చలనం లేదని స్థానిక ప్రజలు, టెండర్ దారులు మండిపడుతున్నారు. భక్తుల కానుకలు, స్వామివారి సొత్తు ఇలా అధికారుల, సిబ్బంది నిర్లక్ష్యంతో పక్కదారి పడుతుండటం చర్చనీయాంశంగా మారింది.

## కార్వాన్‌లో ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు




ఇది కద నిజం ,కార్వాన్: బీసీ ఐక్యవేదిక కార్వాన్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు అనిల్, వేణు గౌడ్ మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. సామాజిక న్యాయం కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పూలే చేసిన కృషి వెలకట్టలేనిదని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు అనిల్ మాట్లాడుతూ, సమాజంలో సమానత్వం మరియు విద్య యొక్క ప్రాముఖ్యతపై పూలే చూపిన బాటలో నడవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో బీసీ నాయకులు, కార్యకర్తలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పిట్లం మండలంలో ఘనంగా మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలు



ఇది కద నిజం, పిట్లం: కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. జాతీయ బీసీ సంక్షేమ సంఘం పిట్లం మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు, మేధావులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సమాజంలో వేళ్లూనుకున్న అసమానతలను తొలగించి, విద్య, సామాజిక న్యాయం మరియు అణగారిన వర్గాల సాధికారత కోసం పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. నేటి సమాజంలో ఆయన ఆశయాలు ఎంతో స్ఫూర్తిదాయకమని, బీసీ వర్గాల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా పోరాడాలని సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, మేధావులు మరియు ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# యాదగిరిగుట్టలో “Arrive Alive” అవగాహన సదస్సు

**రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై పోలీసుల నొక్కి వక్కాణింపు**

ఇది కద నిజం, యాదగిరిగుట్ట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, గౌరవ డిజిపి శివధర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన “Arrive Alive” క్యాంపెయిన్-2026 లో భాగంగా ఈరోజు (11/04/2026) యాదగిరిగుట్ట మండల కేంద్రంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట పరిధిలో ఏప్రిల్ 13 నుండి 18వ తేదీ వరకు చేపట్టవలసిన పలు భద్రతా కార్యక్రమాలపై ఇన్‌స్పెక్టర్ సమగ్రంగా వివరించారు.

ఈ సదస్సులో ముఖ్యంగా రోడ్డు భద్రతా నియమాలు, సిసి కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యతను అధికారులకు మరియు ప్రజలకు వివరించారు. ప్రమాదాల నివారణకు అందరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ మరియు రాష్ డ్రైవింగ్‌ల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అలాగే సమాజానికి ముప్పుగా మారిన గంజాయి, డ్రగ్స్ పట్ల యువతను అప్రమత్తం చేయాలని, సైబర్ నేరాలు మరియు ఇటీవల పెరుగుతున్న ‘డిజిటల్ అరెస్ట్’ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే తక్షణమే 100 నంబర్‌కు డయల్ చేసి పోలీసులను సంప్రదించాలని సూచించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తీసుకున్న ఈ నిర్ణయాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తామని ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు.

## ప్రజల కష్టాలకు తక్షణ పరిష్కారం

**□11వ వార్డులో బోరు వేయించిన సర్పంచ్ చంద్రశేఖర్**



ఇది కద నిజం, పిట్లం ఏప్రిల్11: కామారెడ్డి జిల్లా పిట్లం గ్రామ పంచాయతీ పరిధిలోని 11వ వార్డులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నట్లు గుర్తించిన పిట్లం గ్రామ సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ వెంటనే స్పందించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే బోరు వేయించి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు సర్పంచ్ చూపిన చొరవను గ్రామస్తులు అభినందించారు. ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవడం నాయకత్వ లక్షణమని పేర్కొంటూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని గ్రామ ప్రజలు కోరారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎర్రబోడలో ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు



ఇది కద నిజం :రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని ఎర్రబోడలో సామాజిక విప్లవకారుడు, మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి ఉత్సవాలను స్థానికులు, నాయకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, విద్యారంగ అభివృద్ధికి పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో నాయకులు విజయ్ కుమార్, పట్నం నరేష్, వెంకటేష్, సిద్దులు, సుధాకర్, కిట్టు, విజేందర్ తదితరులు పాల్గొని పూలే సేవలను స్మరించుకున్నారు.




# మహాత్మా జ్యోతిరావు పూలే ఒక స్ఫూర్తి ప్రదాత

**కన్యగారి నర్సింహ్మారెడ్డి సిపిఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి**

ఇది కద నిజం :మహాత్మా జ్యోతిరావు పూలే 199 జయంతి సందర్భంగా రాజేంద్రనగర్ జూనియర్ కాలేజీ గేటు ఎదురుగా మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలదండ వేసి నివాళులు అర్పించిన కన్యగారి నర్సింహ్మారెడ్డి సిపిఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ? సామాజిక విప్లవకారుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి, మహాత్మా జ్యోతిరావు పూలే గారి జయంతిని జరుపుకోవడం ఎంతో గర్వకారణం ?సమాజంలో ఉన్న మూఢనమ్మకాలు, కుల వివక్ష మరియు అజ్ఞానం అనే చీకట్లను తొలగించి, జ్ఞాన దీపాన్ని వెలిగించిన మహానుభావుడు ఆయన. ఆయన గురించి మనం ఎంత చెప్పుకున్నా తక్కువే పూలే గారు చెప్పినట్లు “విద్య లేనిదే ఏదీ సాధ్యం కాదు” ఆయన తన భార్య సావిత్రిబాయి పూలే గారితో కలిసి అప్పట్లో కఠిన పరిస్థితులను ఎదుర్కొని మరి స్త్రీ విద్య కోసం పోరాడారు. నేడు మనం ఆ అడుగుజాడల్లో నడుస్తూ, మన పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడమే ఆయనకు మనం ఇచ్చే గొప్ప గౌరవం మనుషులందరూ సమానమేనని, కుల, మతాల పేరుతో జరిగే వివక్ష సమాజానికి శాపమని ఆయన బలంగా నమ్మారు సమాజంలో వెనుకబడిన వర్గాల హక్కుల కోసం ‘సత్యశోధక్ సమాజ్’ ద్వారా ఆయన చేసిన కృషి చరిత్రలో నిలిచిపోయింది మహిళలు కేవలం గడప దాటడమే కాదు,సమాజ గమనాన్ని మార్చగలరని ఆయన నిరూపించారు. వితంతు వివాహాలను ప్రోత్సహించడం, మహిళా విద్యావ్యాప్తి కోసం ఆయన చేసిన పోరాటం నేటికీ మనకు ఆదర్శం ?మహాత్మా పూలే గారు కేవలం ఒక వ్యక్తి కాదు, ఆయన ఒక ఆలోచనా విధానం. సమాజంలో మార్పు రావాలంటే మనం కేవలం ఆయన గురించి మాట్లాడితే సరిపోదు. ఆయన చూపిన మార్గంలో, అణగారిన వారికి అండగా నిలవడం, అందరికీ సమాన అవకాశాలు కల్పించడం మరియు విద్యను ప్రోత్సహించడం ద్వారా ఆయన కలలు గన్న “సమసమాజం” వైపు మనం అడుగులు వేయాలి ?ఈ జయంతి సందర్భంగా, మనం కూడా సమాజ రుణం తీర్చుకోవడానికి చిత్తశుద్ధితో కృషి చేయాలి అని ఆయన అన్నారు లిఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు జే ఆనంద్ గౌడ్ మండల సహాయ కార్యదర్శి జె విజయ్ ఆనంద్ గౌడ్ మండల కౌన్సిల్ సభ్యులు జె.సదానంద గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.



## ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి ‘అయ్యప్ప విషు మహా పడిపూజ’ ఆహ్వానం

ఇది కద నిజం, హైదర్‌గూడ: హైదర్‌గూడ శ్రీ ప్రణవ భక్త సమాజము ఆధ్వర్యంలో నిర్వహించనున్న 27వ శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి విషు మహా పడిపూజ కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డిని నిర్వాహకులు కోరారు. ఈ నెల 14వ తేదీ (మంగళవారం) మల్కి దాసు హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో ఈ వేడుకను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు.

శ్రీ ప్రణవ భక్త సమాజము ప్రచార కార్యదర్శి సాబాద విజయ్ కుమార్ మరియు సభ్యులు కాకులారం కృష్ణ కలిసి ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు ఈ సందర్భంగా విన్నవించారు.


# సామాన్యులకు విద్యా ప్రదాత జ్యోతి రావు పూలే

**జై స్వరాజ్ పార్టీ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు ఇంజ గణేష్**



ఇది కద నిజం: సామాన్యులకు విద్యా ప్రదాత జ్యోతి రావు పూలే అని, ఆయన స్ఫూర్తితో ప్రజలు నవ భారత నిర్మాణానికి ముందుకు రావాలని, యువత, కార్మికులు రాజకీయాల్లోకి రావాలని, జై స్వరాజ్ పార్టీ వారికి సరైన వేదిక అని జై స్వరాజ్ పార్టీ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు ఇంజ గణేష్ అన్నారు. శనివారం జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా హైదరాబాద్లోని హెచ్బీ కాలనీ మౌలాలి కైలాసగిరి కమాన్ దగ్గర జై స్వరాజ్ పార్టీ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ రాష్ట్ర నాయకుడు ఇంజ గణేష్ ఆధ్వర్యంలో కార్మికులు మహనీయునికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ నూతన విధానాలతో ప్రజల్లోకి వెళ్తోందని, పేదలు లేని సమాజం కోసం పార్టీ పని చేస్తుందని, జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారని గణేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్. నవీన్, దాసు, ఈశ్వర్, శ్రీనివాస్, కిరణ్, ప్రవీణ్, చంద్రయ్య, సురేష్, లక్ష్మణ్, రవి, విజయ్, జయపాల్, లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీల్లారా జై స్వరాజ్ పార్టీ జెండా పట్టండి!



- మన పాలనలోనే బీసీల న్యాయమైన ప్రతి డిమాండ్ పరిష్కరిస్తాం!
- ప్రజల్లో సమభావం కల్పించే నిఖార్సయిన పార్టీ జై స్వరాజ్ పార్టీనే
- రండి! మన రాజ్యం మనం ఏలుదాం
- జ్యోతి రావు పూలే జయంతి వేడుకల్లో బీసీలకు జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ పిలుపు

ఇది కద నిజం ,హైదరాబాద్: " బీసీల్లారా జై స్వరాజ్ పార్టీ జెండా పట్టండి. తెలంగాణలో జై స్వరాజ్ పార్టీనే అధికారంలోకి వస్తుంది. బీసీల న్యాయమైన ప్రతి డిమాండ్ ను పరిష్కారిస్తాం. రైతులు, యువకులు, మహిళలు ఇప్పటికే జై స్వరాజ్ పార్టీ పట్ల ఆకర్షితులయ్యారు. తెలంగాణలోని ఓసీ, బీసీ, ఎస్టీ, ఎస్సీ, హిందూ, మైనారిటీల ఆకాంక్షలకు నిఖార్సయిన పార్టీ జై స్వరాజ్ పార్టీ. రండి మన రాజ్యం మనం ఏలుదాం! " అని సామాజిక న్యాయం, సమానత్వం కోసం పోరాడిన మహానేత జ్యోతి రావు పూలే జయంతి వేడుకల్లో జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ ప్రజలకు ఉత్సాహ భరితమైన పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

"బీసీలు ఇకపై మోస పోవాల్సిన అవసరం లేదు. మీ హక్కుల కోసం, మీ భవిష్యత్తు కోసం సరైన వేదిక జై స్వరాజ్ పార్టీ మాత్రమే" అని స్పష్టం చేశారు. హైదరాబాద్లో అంబర్ పేటలో పూలే విగ్రహం వద్ద శనివారం జరిగిన జయంతి వేడుకల్లో

కాసాని శ్రీనివాసరావు గౌడ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మరింతగా ఆయన మాట్లాడుతూ

"జ్యోతి రావు పూలే ఆశయాలను నిజంగా అమలు చేయాలంటే, బీసీలు రాజకీయంగా బలంగా నిలవాలి. అధికారం మన చేతుల్లోకి రాకపోతే న్యాయం జరగదు. జై స్వరాజ్ పార్టీ ఆ మార్పు కోసం పోరాటం చేస్తోంది" అని తెలిపారు.

బీసీల స్వాభిమానాన్ని కాపాడుతూ, వారి హక్కులను సాధించే దిశగా జై స్వరాజ్ పార్టీ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ జయంతి సందర్భంగా, ప్రతి బీసీ కుటుంబం ఒక్కటిగా ఐక్యంగా ముందుకు రావాలని, స్వయంగా తమ భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలని కేఎస్ఆర్ గౌడ పిలుపునిచ్చారు. అలాగే "సమాజంలో అణగారిన వర్గాలకు విద్య, సమానత్వం, హక్కుల కోసం జీవితాంతం పోరాడిన

జ్యోతి రావు పూలే ఆశయాలు కేవలం చరిత్రలో మిగిలి పోవడానికి కాదు... అవి ఈ రోజూ సమాజాన్ని మార్గనిర్దేశం చేసే శక్తి. బీసీలకు న్యాయం జరగాలంటే మాటలు కాదు, స్పష్టమైన విధానాలు దృఢ సంకల్పం అవసరం" అని తెలిపారు. జై స్వరాజ్ పార్టీ నేడు స్పష్టం చేస్తోందని, తమ పాలనలో బీసీల న్యాయమైన ప్రతి డిమాండ్ను పూర్తిగా నెర వేర్చుతామని, విద్య, ఉపాధి, కాంట్రాక్టులు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అన్ని రంగాల్లో బీసీలకు సముచిత అవకాశాలు కల్పిస్తామని కేఎస్ఆర్ గౌడ అన్నారు. సంవత్సరాలుగా కొనసాగుతున్న అన్యాయం, నిర్లక్ష్యానికి ముగింపు పలుకుతామని,

అంతేకాకుండా, బీసీల అభ్యున్నతికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, అమలు చేయడానికి కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు.

"బీసీలు ఇకపై హామీలకు బలి కావాల్సిన అవసరం లేదు. జై స్వరాజ్ పార్టీ వారి స్వరంగా, వారి బలంగా నిలుస్తుంది" అని కాసాని శ్రీనివాసరావు గౌడ అన్నారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ పార్టీ అధ్యక్షుడు రాయబండి పాండురంగంతో పాటు పలువురు నాయకులు, సబ్బండ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన..



ఇది కద నిజం :నేటి బాలలే రేపటి పౌరులు.. సైబర్ నేరాల పట్ల విద్యార్థులు కూడా అప్రమత్తంగా ఉండాలని బాలానగర్ సిఐ నరసింహారాజు పిలుపునిచ్చారు. స్కూల్ విద్యార్థులకు సైబర్ నేరాల పై అవగాహన కల్పించడం నేటి డిజిటల్ కాలంలో చాలా ముఖ్యమని.. గుర్తుతెలియని వ్యక్తుల నుండి వచ్చే లింక్‌లను క్లిక్ చేయటం, వ్యక్తిగత సమాచారాన్ని (పాస్‌వర్డ్‌లు, చిరునామా) సోషల్ మీడియాలో షేర్ చేస్తే వచ్చే ఉపాద్రవాలు, వాటి పట్ల జాగ్రత్తగా ఉండడం వంటివి ముఖ్యమైన జాగ్రత్తలను బాలానగర్ సిఐ నర్సింహా రాజు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ రోజు బాలానగర్ పోలీస్ స్టేషన్ పరధిలోని బ్రైట్ కాన్సెప్ట్ స్కూల్ లో సైబరక్రైమ్ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, ఏదైనా అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు తెలపాలిని ఈ కార్యక్రమం ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. మొబైల్ ద్వారానే 80 శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. పెరుగుతు న్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరాలకు కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని విద్యార్థులు అవగాహన పెంచుకుని ఇటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎప్పుడూ బలమైన, ప్రత్యేకమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించాలని.. ఫోన్లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీయం, ఫోన్ పే, గూగుల్ పే, ఈ కేవైసీ అప్‌డేట్ వివరాలు అడిగితే చెప్పకూడదని సూచించారు. సైబర్ నేరాలకు గురైనపుడు 1930 టోల్ ఫ్రీ నెంబరుకు వెంటనే డయల్ చేసి ఫిర్యాదు చేయాలని వివరించారు. తెలియని వ్యక్తుల నుండి వచ్చే ఈమెయిల్‌లు, మెసేజ్‌లలోని అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయకూడదని హెచ్చరించారు. ఫోటోలు, వీడియోలు, బ్యాంక్ వివరాలు వంటి వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దు.. ఆన్‌లైన్‌లో ఎవరైనా వేధించినా, భయపెట్టినా వెంటనే తల్లిదండ్రులకు లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ ఎస్ఐ సరిత రెడ్డి, స్కూల్ కరెస్పాండంట్ వినోద్ కుమార్, టీచర్స్, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# టిడిపిలో ప్రతి ఒక్కరూ మా కుటుంబ సభ్యులే




అమరావతి,ఇది కద నిజం,ఏప్రియల్ 11: టిడిపి పార్టీలో ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులేనని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. పార్టీ కార్యాలయంలో జరుగుతున్న శిక్షణ తరగతుల్లో పాల్గొని ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా మాట్లాడారు. సీనియర్ నేతలతో నేతలకు, కార్యకర్తలకు శిక్షణ, క్రమశిక్షణ జరుగుతున్న అంశాలపై కార్యకర్తలతో కాఫీ తాగుతూ తన అభిప్రాయాలను చంద్రబాబు పంచుకున్నారు. రాజకీయాల్లో, పరిపాలనలో గత పరిణామాలు, ప్రస్తుత సంక్షేమం, అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలను కార్యకర్తలకు చంద్రబాబు వివరించారు.

క్షేత్రస్థాయిలో వివిధ పథకాలు, కార్యక్రమాల అమలుపైనా నేతలు, కార్యకర్తల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు.

సమాజంలో జరిగిన,జరుగుతున్న పరిణామాలను... ప్రత్యర్థి పార్టీ దుర్మార్గాలను సామాన్య కార్యకర్తలైనా మెరుగ్గా విశ్లేషించేలా అవగాహన పెంచుకోవాలని సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. పార్టీ కార్యకర్తల ఆర్థిక బలోపేతానికి ఈ3 కార్యక్రమం అమలు చేస్తామని, క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టాం... క్లీన్ ఎనర్జీని ఎంకరేజ్ చేస్తున్నాం... క్లీన్ పాలిటిక్స్ కూడా చేస్తున్నాం. క్లీన్ పాలిటిక్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా టీడీపీని నిలిపేలా కార్యకర్తలు పని చేయాలి. పాజిటివ్ పాలిటిక్స్ చేయాలి... పాజిటివ్ ఓట్లు పెంచుకోవాలి... గతానికంటే టీడీపీ ఓట్ బ్యాంక్ పెరిగేలా కార్యకర్తలు నాయకులు ప్రజల్లో మార్పు తీసుకురావాలని సీఎం సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు.. ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని కూడా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని అన్నారు.

నీతి, నిజాయితీలతో కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్ కార్యక్రమం చేపడుతానని,నా కుటుంబం కోసం ఏ విధంగా ఆలోచన చేశానో... టీడీపీ కుటుంబం కోసం అదే విధంగా ఆలోచన చేస్తానని చంద్రబాబు నాయకులకు కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొని చంద్రబాబుకు పలు సూచనలు చేశారు.

# బిజెపి ఆధ్వర్యంలో కొత్తపేట లో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



కొత్తపేట. (ఇది కద నిజం)ఏప్రిల్ 11.బిజెపి ఓబిసి మోర్చ జిల్లా నాయకులు ఇళ్ల పల్లంశెట్టి ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా బిజెపి రాష్ట్ర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం విచ్చేసారు ముందుగా సత్యానందం పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పూలే కులరహిత సమాజం కోసం బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అనేక పోరాటాలు చేశారని మహిళోద్ధారణకు కృషి చేశారని అన్నారు దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులు పొందడానికి "సత్యశోధక్" సమాజ్ ను ఏర్పాటు చేశారన్నారు . వారి ఆశయాలకు అనుగుణంగా బిజెపి వెనుకబడిన తరగతులకు చెందిన నరేంద్ర మోడీ గారిని దేశ ప్రధానిగా చేసిందన్నారు . నరేంద్ర మోడీ గారి సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన తరగతులకు అనేక సంక్షేమ పథకాలతో పాటూ చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించిందన్నారు .ఆ మహనీయుని అడుగు జాడల్లో నడుచుకునే నిస్వార్థ నాయకులనే ప్రజలు ఎన్నుకోవాలని ఈసందర్భంగా తెలియజేశారు ఈకార్యక్రమంలో ఎస్సి మోర్చా జిల్లా అధ్యక్షులు పొనుగు పాటి శ్రీనివాస్, రాష్ట్ర యువ మోర్చా నాయకులు పాలూరి జయ ప్రకాష్ నారాయణ,యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కోటిపల్లి దామోదర్, ఆత్మ కమిటీ డైరెక్టర్ పాలాటి మాధవ స్వామి, సబ్బవరపు సత్యనారాయణ,బిజెపి యువమోర్చ మండల అధ్యక్షుడు వలపుశెట్టి కిరణ్ తేజ్ ,కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# మహానాడు ఏర్పాట్ల మీద నాయకుల పరిశీలన



విజయనగరం/శ్రీకాకుళం, ఏప్రిల్ 10: స్వర్గీయ నందమూరి తారకరామారావు గారి జయంతి సందర్భంగా ప్రతి ఏడాది తెలుగు తమ్ముళ్ల అత్యంత వైభవంగా నిర్వహించే మహానాడు ఈసారి మరింత ఘనంగా, చారిత్రాత్మకంగా నిర్వహించేందుకు టీడీపీ సన్నాహాలు వేగం పుంజుకున్నాయి. ఈ నేపథ్యంలో మహానాడు 2026 నిర్వహణకు అనువైన వేదిక ఎంపిక కోసం టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే శ్రీ పల్లా శ్రీనివాసరావు గారు కీలక నేతలతో కలిసి పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు.

ఈ సందర్భంగా ఒకేరోజు మొత్తం తొమ్మిది అనువైన స్థలాలను పల్లా గారు పరిశీలించారు. వాస్తు అనుకూలత, విస్తీర్ణం, రవాణా సౌకర్యాలు, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు, లక్షలాది మంది కార్యకర్తలు సౌకర్యవంతంగా పాల్గొనే అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి స్థలాన్ని సమగ్రంగా పరిశీలించినట్లు తెలిపారు. మహానాడు నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాట్లు ఉండేలా కసరత్తు జరుగుతోందన్నారు.

నాథవలస (విజయనగరం పార్లమెంట్), పైడిభీమవరం (ఎచ్చర్ల నియోజకవర్గం), పిసిని రోడ్--పాటివాడిపాలెం (రణస్థలం మండలం), సింగవరం (డెంకాడ మండలం, నెల్లిమర్ల నియోజకవర్గం) తదితర ప్రాంతాల్లో స్థలాలను పరిశీలిస్తూ, మౌలిక వసతులు, విస్తరణ అవకాశాలు, రవాణా అనుసంధానం వంటి అంశాలపై అధికారులు, స్థానిక నాయకులతో చర్చించారు.

ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ గారు స్థాపించిన తెలుగుదేశం పార్టీకి మహానాడు ఆత్మగౌరవ సభ. పార్టీ ప్రతిష్టకు తగ్గట్టుగా, దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా నిలిచే విధంగా మహానాడు 2026ను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేపడుతున్నాం అని తెలిపారు.

ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి మార్గదర్శకత్వం, యువతి ని ఆకర్షించేలా పార్టీని ముందుకు తీసుకెళ్తున్న మంత్రి శ్రీ నారా లోకేష్ గారి కార్యచరణతో మహానాడు మరింత వైభవంగా కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించబడుతుందని పల్లా గారు పేర్కొన్నారు. అన్ని అంశాలను సమీక్షించి తగిన వేదికను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. మహానాడు 2026ను పార్టీ చరిత్రలో మరో మైలురాయిగా నిలిపే దిశగా కార్యకర్తలందరూ సమన్వయంతో ముందుకు సాగాలని పల్లా శ్రీనివాసరావు గారు పిలుపునిచ్చారు.


ఈ పర్యటనలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త మంతెన సత్యనారాయణ, జోనల్ కోఆర్డినేటర్ దామచర్ల సత్య, పిపిపి కిమిడి నాగార్జున, నెల్లిమర్ల ఇంచార్జి కర్రోతు బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం కోసం పోరాడిన మహనీయుడు



నల్లగొండ (ఇది కద నిజం) సామాజిక న్యాయం కోసం పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతి రావు పూలే అని సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత తెలిపారు.. జిల్లా కేంద్రంలోని యం.జి. రోడ్డు సర్కిల్ వద్ద వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మా జ్యోతి రావు పూలే జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కే. సీతారామా రావుతో కలిసి పాల్గొని, జ్యోతి రావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఛైర్పర్సన్ మాట్లాడుతూ.... సమానత్వ సమాజ నిర్మాణంలో పూలే కీలక పాత్ర పోషించారని, కుల, మత భేదాలు ఉన్న అనాటి పరిస్థితుల్లో సామాజిక సంస్కరణలకు పూలే శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. మొదటగా తన భార్య సావిత్రిబాయి పూలేకు విద్యాబోధన చేసి, ఆ తర్వాత ఆమె ద్వారా బాలికల విద్యకు మార్గం సుగమం చేసిన గొప్ప సంస్కర్త అని కొనియాడారు.

# 18న నిడదవోల 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో పాల్గొననున్న చంద్రబాబు



అమరావతి,ఇది కద నిజం ఏప్రిల్ 11: రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మూడవ శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఈనెల 18న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిడదవోలు పర్యటనకు రానున్నారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబునాయుడు చారిత్రాత్మక నిడదవోలు నియోజకవర్గాన్ని ఎంపిక చేసుకున్నందుకు సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారిగా సీఎం నిడదవోలుకు విచ్చేస్తుండటంతో మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మరియు ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో మాలకోదూరు చెరువు, చినకాశీరేవు, లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రాంగణం, మహిళా కళాశాల ప్రాంగణం, కరెంట్ ఆఫీస్ స్థలం, పంగిడి రోడ్డులోని బ్రాహ్మణగూడెం ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం పర్యటించిన ప్రాంతాల్లో సంబంధిత ఏర్పాట్లపై శనివారం సమీక్షించారు.

ముఖ్యమంత్రి పర్యటన నిమిత్తం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు పట్టణంలోని లయన్స్ హాస్పిటల్ సమీపంలోని మాలకోదూరు చెరువును, చినకాశీరేవు, ప్రజావేదిక కోసం ప్రస్తుతం ప్రెస్ మీట్ జరిగిన ప్రాంతం, కార్యకర్తల సమావేశం కోసం లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రాంగణం, హెలిప్యాడ్ కోసం పంగిడి రోడ్డులోని బ్రాహ్మణ గూడెం ప్రాంతాలను పరిశీలించామన్నారు. అక్కడి నుండి సీఎం సభావేదికకు వచ్చి తిరిగి వెళ్లేలా రూట్ మ్యాప్ రూపొందించామన్నారు. ఈ ప్రాంతాల ఎంపికపై సమగ్రంగా అధ్యయనం చేస్తున్నామన్నారు. ఈ విషయంపై సీఎంవోతో చర్చించి వారి అభిప్రాయాలు తీసుకొని ముందుకు వెళ్తామన్నారు. పూర్తిస్థాయి చర్చలు జరిగాక కార్యక్రమం షెడ్యూల్ రూపొందిస్తామన్నారు. మే1 న ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పంపిణీ చేసే కార్యక్రమానికి రావాల్సిందిగా సీఎం చంద్రబాబునాయుడును విజ్ఞప్తి చేశానని, తుది నిర్ణయం వచ్చాక ఆ వివరాలు వెల్లడిస్తానన్నారు.

# సామాజిక సమానత్వానికి మార్గదర్శకుడు మహాత్మ జ్యోతిరావు పూలే



రావులపాలెం (ఇది కద నిజం ) ఏప్రిల్ 11.మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా రావులపాలెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే భారతదేశంలో సామాజిక సమానత్వం కోసం అహర్నిశలు శ్రమించిన మహనీయుడని కొనియాడారు. మహిళా విద్యకు శ్రీకారం చుట్టి, అణగారిన వర్గాలకు విద్య అందించాలని కృషి చేసిన గొప్ప సంస్కర్తగా ఆయన నిలిచారని తెలిపారు.